## క్లుప్తంగా

### నవోదయలో సీటు సాధించిన విద్యార్థి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని సెయింట్‌మేరీస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థి పెసరు హర్షిత్‌కుమార్ ఇటీవల నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమప్రతిభతో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడు. ఈ మేరకు హర్షిత్‌కుమార్‌ను శనివారం పాఠశాలలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి నవోదయలో సీటు సాధించడంపై కరస్పాండెంట్ జోమీ జోసెఫ్, ప్రిన్సిపాల్ షైనీ జోమీ, పీఈటీ రాజారపు మహేందర్ హర్షం వ్యక్తం చేశారు.

### వైభవంగా వారకల్యాణం

చిల్పూరు: చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన రాపోలు చంద్రశేఖర్–చంద్రకళ, శిరీష, ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ శాశ్వత దాతలు సంగోజు మోహనాచారి–శంకరలక్ష్మి, రఘువీర్, సిబ్బంది పాల్గొన్నారు.

### లింగంపల్లికి బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి

బచ్చన్నపేట : మండలంలోని లింగంపల్లికి జనగామ ఆర్టీసీ డిపో నుంచి బస్సును పునరుద్ధరించాలని సీపీఎం మండల ఇన్‌చార్జ్ సుంచు విజేందర్ అన్నారు. శనివారం జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జనగామ నుంచి బచ్చన్నపేట మీదుగా లింగంపల్లి నుంచి గజ్వేల్‌కు బస్సు సర్వీసులు నడిచేవి అన్నారు. ఇప్పుడు ఆ సర్వీసులను నిలిపివేయడంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వెంకటవ్వ, రాజు, తాడెం రాములు, రాజవ్వ పలువురు పాల్గొన్నారు.

### మైనార్టీలకు అండగా యాకూబ్‌పాషా

జనగామ రూరల్: పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు, ఇమామ్‌లకు ప్రతి ఏటా నిత్యావసర వస్తువులు అందజేస్తూ పట్టణానికి చెందిన ఎండీ.యాకూబ్‌పాషా ఆదర్శంగా నిలుస్తున్నాడు. హంసాత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఉన్నటు వంటి మజీద్ ఇమామ్‌లకు శనివారం నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులో భాగంగా పండ్ల పంపిణీ చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఉన్న ఇమామ్‌లకు, అలాగే మజీద్, ఈద్గాలు ఖబ్రస్తాన్‌ల అభివృద్ధికి ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో రిజ్వాన్, ఆసిఫ్, షరీఫ్, యాకూబ్, ఆజాద్, అమ్రాన్, ముక్తర్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని శ్రీతిరుమలనాథస్వామి దేవస్థానంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. శోభాకృత నామ సంవత్సరంలో చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. ఆలయ ప్రధాన పూజారి కలకోట రంగాచార్యులు ఆధ్వర్యంలో శ్రీతిరుమలనాథస్వామికి అర్చన, అభిషేకం పూజలు చేపట్టారు.

### రెండు ట్రాలీ ఆటోలు సీజ్

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల వాగులో నుంచి కదారి శ్రీకాంత్, కదారి ప్రశాంత్ లు అక్రమంగా ట్రాలీ ఆటోల్లో ఇసుక తరలిస్తుండగా రెండింటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. మండలంలోని వాగుల్లో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన తీసుకుంటామని హెచ్చరించారు.

### మాదిగలకు ద్రోహం చేస్తున్న సీఎం



నర్మెట : సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ద్రోహం చేస్తున్నాడని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ మాదిగ అన్నారు. శనివారం మాదిగలకు కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఎంపీ సీట్లలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు కేటాయించకుండా తీవ్రమైన అన్యాయం చేశారని అన్నారు. మాదిగలను విస్మరించిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్, రాష్ట్ర నాయకులు చుంచు రాజు, నాయకులు కంతి చరణ్, మెతుకు సిద్దులు, చెవుల రాజు, సాయినాథ్ పాల్గొన్నారు.

# దమ్ముంటే కడియం రాజీనామా చేయాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో రైతుదీక్ష



స్టేషన్‌ఘన్‌పూర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా



పాలకుర్తి: మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి దమ్ము, ధైర్యం, ఉంటే తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో చేపట్టిన రైతుదీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పల్లా మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రమంతా స్టేషన్‌ఘన్‌పూర్ వైపే చూస్తున్నారన్నారు. నీతిపరుడిని, నిజాయితీమంతుడని చెప్పుకునే కడియం కారు గుర్తుతో గెలిచి పార్టీ శ్రేణులను మోసం చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లాడన్నారు. పార్టీపై, కేసీఆర్‌పై నమ్మకంతో ఉన్న నిఖార్సయిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, దొంగలు, మోసగాళ్లు, తాలు లాంటి వారు పార్టీ మారారని ఎద్దేవా చేశారు. కడియం నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణులను దగా చేసి డబ్బులకు అమ్ముడుపోయాడని, కుమార్తెకు టికెట్‌కోసం పార్టీ కార్యకర్తల ఆత్మాభిమానాన్ని ఫణంగా పెట్టాడని ఆరోపించారు. కడియంను నియోజకవర్గ ప్రజలు రాజకీయ సమాధి చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్, వేలేరు జెడ్పీటీసీ చాడ సరిత, లింగాలఘనపురం ఎంపీపీ చిట్ల జయశ్రీ, రాష్ట్ర నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, మెట్టు శ్రీను, రాకేష్‌రెడ్డి, చేవెల్లి సంపత్, బాలరాజు, చందర్‌రెడ్డి, కుమార్, పి.మహేందర్‌రెడ్డి, గణేష్, ప్రసాద్, ఐలయ్య, భాగ్యలక్ష్మీ, సునీత, పావని, జయపాల్ పాల్గొన్నారు.

**హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ : ఎర్రబెల్లి**

పాలకుర్తి: ఎన్నికల ముందు ఎన్నో హామీలతో పాటు రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ పథకం అమలుచేయడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం పాలకుర్తిలో చిట్యాల అయిలమ్మ విగ్రహం వద్ద రైతులు దీక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దయాకర్‌రావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఎన్నో వాగ్దానాలతో సీఎం పదవి చేపట్టిన రేవంత్‌రెడ్డి రైతుల సమస్యలు పరిష్కరించడం లేదని అన్నారు. రైతులకు సరైన పెట్టుబడి లేక రైతుల కళ్లలో ఆనందం కనిపించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ మీద సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు, ఎన్నికల తర్వాత చేస్తున్న వాగ్దానాలపై వీడియోలను ప్రసారం చేస్తూ చెప్పారు. వీడియోల తీరుపై బీఆర్‌ఎస్ నాయకులు అర్థం చేసుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీక్షలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, ఎంపీపీ నల్ల నా గిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్, సుందర్‌రాంరెడ్డి, మ ల్లేశం, శ్రీనివాస్, ఐటయ్య, రాము పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించాలి



రామరాజుపల్లి పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న ఉమ

దేవరుప్పుల : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సత్వరమే కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని పద్మ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రామరాజుపల్లి, నీర్మాల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు వచ్చే ముందు విద్యాపరమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీలిస్తున్న పాలకవర్గాలు ఆచరణాత్మకంగా విస్మరిస్తున్నారని విమర్శించారు, పాఠశాలలో రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఆ శాఖ నిర్లిప్త వైఖరితోపాటు కార్పొరేటీకరణ విద్యను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వేసవి సెలవుల్లోనే మౌలిక వసతులు కల్పించనట్లయితే విద్యాసంవత్సర ప్రారంభంలో ఎస్ఎఫ్ఐ పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కృష్ణవేణి సేవలు మరువలేనివి



ఆర్థికసాయాన్ని అందిస్తున్న డీఈఓ రాము

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయురాలు తులసి కృష్ణవేణి సేవలు మరువలేనివని డీఈఓ రాము అన్నారు. శనివారం తులసి సంస్మరణ సభను పాఠశాల ఆవరణలో గొట్టి కనుకయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. టీఎస్ యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ. 6 లక్షల సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, కోశాధికారి సుధాకర్, కార్యదర్శులు కృష్ణ, నోడల్ అధికారి మూర్తి, పాఠశాల హెచ్‌ఎం కృష్ణమోహన్, బాధ్యులు శ్రీధర్, లలిత, నీలకంఠం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సుస్థిర, సమర్థ పాలన బీజేపీతోనే సాధ్యం



రఘునాథపల్లి : కోమల్లలో బీజేపీ జెండావిష్కరిస్తున్న ఉపేందర్, వెంకటేశంయాదవ్



కొడకండ్ల : సన్మానిస్తున్న కోటేశ్వర్‌రావు



జఫర్‌గఢ్: జెండావిష్కరిస్తున్న బీజేపీ నేతలు



నర్మెట : జెండావిష్కరణ చేసిన అనంతరం నినాదాలు చేస్తున్న బీజేపీ శ్రేణులు



బచ్చన్నపేట : బీజేపీ జెండావిష్కరణ చేసిన నరేందర్‌రెడ్డి

సుస్థిర సమర్థ పరిపాలన బీజేపీతోనే సాధ్యమని, ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవడం ఖాయమని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా మండల కేంద్రాల్లో బూత్‌స్థాయి టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించి జెండాలను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపర్చాలన్నారు. కుటుంబ పాలన కోసం వెంపర్లాడే పార్టీలకు ప్రజలకు తమ ఓటు ద్వారా గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయాలకతీతంగా అనేక ప్రజారంజకమైన శాశ్వత ప్రాతిపదికన సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే రాష్ట్ర ప్రభుత్వాలు తమవిగా ప్రజల్లో తప్పుడు సమాచారం చేస్తున్నారన్నా రు. నిరుపేదలకు అందాల్సిన కొన్నింటిని ప్రజలకు చేరకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. భావిపౌరులైన యువత బీజేపీలో స్వచ్ఛందంగా దేశాభివృద్ధికి బాసటగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షులు, ముఖ్యనాయకులు, మహిళా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

# జనజాతరకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్‌లోని తుక్కుగూడ జనజాతర సభకు శనివారం ఆయా మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుల సారథ్యంలో మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల నుంచి నాయకులు వాహనాల్లో సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు దేశ ప్రధానిగా రాహుల్‌గాంధీ అవుతారన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొడకండ్ల : సభకు తరలివెళ్తున్న నాయకులు



చిల్పూరు: చిన్నపెండ్యాల నుంచి..



పాలకుర్తి టౌన్: సభకు తరలివెళ్తున్న నాయకులను కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



రఘునాథపల్లి : తరలివెళ్తున్న నేతలు



బచ్చన్నపేటలో..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

# ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి మేరు సంఘం ఆధ్వర్యంలో శనివారం క్రోధి నామసంవత్సర క్యాలెండర్‌ను మేరు సంఘం దైవం జిలగిరి శంకర దాసమయ్య, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి ప్రశాంత్, జిల్లా కార్యదర్శి సోమ వెంకన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కీర్తిరాజ్ కమల్ , రామగిరి శ్రావణ్, కొత్తకొండ వాసు, కీర్తి యాదగిరి, లెనిల్, లక్ష్మీనారాయణ, రవి, కీర్తి కుమార్, నాగరాజు, నిరంజన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేరు సంఘం నాయకులు

# అనాథాశ్రమంలో మహిళ మృతి

- ఏసీపీ చొరవతో బంధువులకు అప్పగింత



మృతదేహాన్ని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో అనారోగ్యంతో గత కొన్ని రోజుల నుంచి ఇబ్బంది పడుతూ శనివారం ఓ మహిళ మృతి చెందింది. మృతదేహాన్ని బంధువులు తీసుకెళ్లకపోవడంతో జనగామ ఏఎస్పీ అంకిత్ కుమార్ షెకావర్ చొరవతో బంధువులకు అప్పగించడం జరిగింది. పోలీసులు, ఆశ్రమ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలానికి చెందిన కాశబోయిన లక్ష్మి (40) టీబీ వ్యాధికి గురై తీవ్రంగా బాధపడుతుండగా ఆమె కుటుంబసభ్యులు లక్ష్మిని, పిల్లలను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. లక్ష్మి ఇంటి నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఉండడం గమనించిన స్థానికులు సామాజిక కార్యకర్త ఎండీ ఫసీకి తెలియజేశారు. దీంతో ఆమెకు మనోధైర్యం చెప్పి జనగామ వృద్ధాశ్రమంలో చేర్పించారు. అప్పటి నుంచి అలనాపాలన ఆశ్రమ నిర్వాహకులు చూసుకున్నారు. కాగా ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా మృతదేహాన్ని తీసుకెళ్లడానికి వారు నిరాకరించారు. జనగామ ఏఎస్పీకి తెలుపగా వెంటనే తన బంధువులను పిలిపించి నచ్చజెప్పి తీసుకెళ్లమని సూచించారు. అంగీకరించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్వగృహానికి తీసుకెళ్లారు. సీఐ ఆధ్వర్యంలో మృతదేహం అ ప్పజెప్పగా ఏఎస్పీకి సామాజిక కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కడియం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పల్లా

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేటకు చెందిన గాదె జయపాల్‌రెడ్డి అనారోగ్యానికి గురై మృతి చెందగా శనివారం స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు వేర్వేరుగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, కాంగ్రెస్ ఎంపీటీసీ కుమార్, రాజమహేందర్‌రెడ్డి ఉన్నారు.

దేవరుప్పుల : మండల కేంద్రంలోని చేనేత కార్మికుడు దొంత నర్సయ్య అకాల మరణం చెందగా ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి శనివారం పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అలాగే పద్మశాలి సంఘం దేవరుప్పుల అధ్యక్షుడు యేల పాపయ్య, చిలుపురం సోమయ్య, కొండయ్య, వెంకన్న, వీరస్వామి, కొండయ్య, నర్సయ్య, చంద్రమౌళి, వెంకన్న తదితరులు ఉన్నారు.

**ఆర్థికసాయం**

దేవరుప్పుల : మండలంలోని పెద్దమడూరులో అకాల మరణం పొందిన పెరిక లలిత కుటుంబానికి వ్యాపారి హనుమాండ్ల భద్రయ్య, ఎంపీటీసీ పానుగంటి గిరి కలిసి శనివారం ఆర్థికసాయం అందించారు. వారి వెంట రాములు, శ్రీశైలం, మహేందర్, యాదగిరి, సోమయ్య, బక్కయ్య, భాస్కర్, శ్రీను, రామచంద్రు, కొండయ్య, ముత్తయ్య, కృష్ణ, నవీన్ కుమార్ ఉన్నారు.

### మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై చింత రాజు

లింగాలఘణపురం: నేటి యువత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్, జ్యోతిరావుపూలే వంటి మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సై చింత రాజు కోరారు. శనివారం మండలంలోని జీడికల్‌లో బీఆర్ అంబేడ్కర్, పూలే జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను ఏర్పాటు చేయగా ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో యువకుల్లో ఐకమత్యం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, యువజన సంఘం అధ్యక్షుడు యాదగిరి, నిర్వాహకులు భరత్, మహేందర్, మధు, జహంగీర్, రమేష్, శ్రీనివాసు, సాయికిరణ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆస్పత్రిలో మజ్జిగ పంపిణీ



ఆస్పత్రిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

జనగామ: వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో లింగాలఘణపురం మండలం శ్రీ వాసవిమాత వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో పేషెంట్లతో పాటు వైద్య సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ చార్టడ్ ప్రెసిడెంట్ గట్టు వెంకన్న, రీజియన్ చైర్మన్ గంగిశెట్టి ప్రమోద్, క్లబ్ మండల ప్రెసిడెంట్ దారం అశోక్, సెక్రటరీ మెతుకు అనంత రాములు, ట్రెజరర్ బెల్డి శ్రీధర్, క్లబ్ సభ్యులు గొడిశాల శివరామకృష్ణ, ఫార్మసిస్ట్ ఉప్పల వెంకట రమణ పాల్గొన్నారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# కార్మిక ఉద్యమ కెరటం బీటీ రణదివె



జనగామ రూరల్: సీఐటీయూ వ్యవస్థాపకుడు కార్మిక ఉద్యమ కెరటం బీటీ రణదివె కార్మికుల చట్టాలు, హక్కుల సాధనకు చేసిన పోరాటం మరువలేనిదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో 34వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నాటి నుంచి నేటి వరకు పోరాడే కార్మిక సంఘం సీఐటీయూ మాత్రమే అన్నారు. రణదివె ఆశయసాధనకు ఐక్యంగా కార్మికులు పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజేందర్, అహల్య, ప్రకాష్, శ్రీనివాస్, లింగం తదితరులు పాల్గొన్నారు.